క్లుప్తంగా

యువతతోనే దేశ అభివృద్ధి


కాలేజీ ఆవరణలో మొక్క నాటుతున్న విద్యార్థినులు, చిత్రంలో సెట్కూరు సీఈఓ రమణ

కర్నూలు సిటీ: యువతతోనే దేశ అభివృద్ధి జరుగుతుందని, మహనీయుల అడుగు జాడల్లో యువతీ, యువకులు నడవాలని సెట్కూరు సీఈఓ పి.వి. రమణ అన్నారు. శనివారం స్థానిక శ్రీసాయి క్రిష్ణ డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ యువజన దినోత్సవం, నా భూమి –నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా యువతకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. శ్రీసాయి క్రిష్ణ డిగ్రీ కాలేజీ అకడమిక్ అడ్వైజర్ పి.గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర సమయ యోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. అనంతరం యువతకు చిత్ర లేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించి, కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ జానీ బాషా, అకడమిక్ డైరెక్టర్ రోశి రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ రంగనాథన్ సేవలు ఎనలేనివి


రంగనాథన్ చిత్ర పట్టం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఉద్యోగులు

కర్నూలు కల్చరల్: గ్రంథాలయ శాస్త్ర పితామహుడిగా డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ అందించిన సేవలు ఎనలేనివని గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో శనివారం రంగనాథన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి గ్రంథాలయ సంస్థ చైర్మన్, గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పాఠకులు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. చైర్మన్ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి రంగనాథన్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. గ్రంథాలయ చట్టాలు రూపకల్పనలో ఆయన ప్రముఖ భూమిక పోషించారన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయ సభ్యత్వం తీసుకొని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవింద రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేయాలి

కర్నూలు(రూరల్):గత సంవత్సరం పండిన పత్తిని సీసీఐ కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని కార్మిక, కర్షక భవనంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రామ్‌తో అనేక లాభాలు

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులకు ప్రభుత్వం జారీ చేస్తున్న ఈ- శ్రామ్ కార్డులతో ఎన్నో లాభాలు ఉన్నాయని కార్మిక శాఖ కర్నూలు సహాయ అధికారి కేశన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వాలు మంజూరు చేసే అనేక పథకాలకు ఈ కార్డులు ప్రామాణికమని, సమీపంలోని సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని వాటిని పొందాలన్నారు.

సేవా లోపం లేకుండా పనిచేయండి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు అందించే సేవల్లో లోపం లేకుండా చూడాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై. సుబ్బన్న సూచించారు. శనివారం ఆయన స్థానిక పవర్ హౌస్‌లోని తన కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల నెలా బిల్లులు చెల్లించే వినియోగదారులపై నిర్లక్ష్యం ప్రదర్శించరాదన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

కర్నూలు(రూరల్): విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు కొనసాగించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు మురళీధర్ తెలిపారు. శనివారం నగరంలోని సీఆర్ భవనంలో ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు మునెప్ప, నాగరాజు, శ్రీనివాసులు, సీపీఐ నగర అధ్యక్షుడు రామకృష్ణా రెడ్డి ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమలో జిల్లా కార్యదర్శి శ్రీరాములు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు శరత్ కుమార్, నగర అధ్యక్ష, కార్యదర్శులు చంటి, మునిస్వామి, అశోక్ మాబు, రాజశేఖర్, సీపీఐ నాయకులు మహేష్, అంజి, బీసన్న, బాబయ్య, రాము, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మేరా భారత్ మహాన్ .. ఆర్మీ డ్రస్‌లో జాతీయ జెండాను చేతబట్టుకుని..


మన మహనీయులు.. స్వాతంత్ర్య సమరయోధుల, జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు

తిరంగా ప్యారా!

ఎందరో మహనీయుల త్యాగ ఫలమే స్వాతంత్ర్యం. రేపు పంద్రాగస్టును పురస్కరించుకుని ఏ క్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో ముందస్తు వేడుకలు నిర్వహించారు. 'ఝుండా ఊంచా రహే హమారా..విజయీ విశ్వ తిరంగా ప్యారా' అంటూ సుమారు 2000 మంది విద్యార్థులు జాతీయ పతాకం ఆకారంలో నిలబడి దేశభక్తిని చాటారు. దేశ స్వాతంత్ర్యంలో అమరులైన సుమారు 150 మంది జాతీయ నాయకులు, వీరులను గుర్తు చేస్తూ వారి వేషధారణలో ఇచ్చిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇండియన్ ఆర్మీ వేషధారణలో మువ్వన్నెల జెండాతో నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


త్రివర్ణ శోభితం.. 2వేల మంది విద్యార్థినీ విద్యార్థులతో జాతీయ పతాకం ఆకారంలో ప్రదర్శన

దోమలపై గంబూజియాస్త్రం!

- నీటి కుంటలు, చెరువుల్లో గంబూషియా చేపల విడుదల
- ఒక్కో చేప రోజుకు వంద లార్వాలకు పైగా స్వాహా
- తద్వారా దోమల నియంత్రణ
- మలేరియా, డెంగీ వ్యాధుల నివారణ
- జిల్లా వ్యాప్తంగా లక్ష చేపలకు పైగా విడుదల
- ఈ ఏడాది కూడా లక్ష దాకా చేపల పంపిణీ


చెరువులు, బావులు, కుంటలలో చేపలు వదులుతున్న వైద్య సిబ్బంది


గంబూషియా చేప

కర్నూలు(హాస్పిటల్): దోమలు పుట్టకూడదు...దోమలు కుట్టకూడదు ఇది ప్రభుత్వ నినాదం. దోమలు కుట్టకుండా ఇప్పటికే చర్యలు చేపట్టిన అధికారులు తాజాగా అవి పుట్టకుండా గుడ్డు దశలోనే అంతమొందించేందుకు గంబూజియాస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. ఒకవైపు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తూ మరోవైపు చెరువులు, నీటి కుంటల్లో లార్వాలు పెరిగి పెద్దవి గాకుండా వాటిని తినేందుకు అందులో గంబూషియా చేపలను వదులుతున్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం విస్తృతంగా సాగుతోంది.

వర్షాకాలం సీజన్‌లో ఎక్కడికక్కడ వాగులు, వంకలు పొర్లడం అలా పారిన నీరు కుంటలు, చెరువుల్లో, పెద్ద పెద్ద ఖాళీ స్థలాల్లో నిల్వ ఉండటం సహజం. వారానికి మించి ఇలా నీరు నిల్వ ఉంటే చాలు దోమలకు గుడ్డు పెట్టేందుకు ఆవాసాలవుతాయి. అందులో మంచినీళ్ల నిల్వ ఉంచే ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంప్‌లు అయితే డెంగీ కారక ఏడిస్ ఈజిప్టై దోమలు సులభంగా పెరిగేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఇలాంటి వాటిలో దోమలు పెట్టిన గుడ్ల(లార్వా)లను నాశనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని మలేరియా విభాగం విస్తృత చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఒకవైపు ఇంటింటికీ తిరిగి మంచినీటి నిల్వలను పరిశీలించి అందులో లార్వాలు ఉంటే ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పారబోయించి శుభ్రం చేస్తున్నారు. మరోవైపు నీటి నిల్వ కుంటలు, చెరువులు, తటాకాలు, ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీటిలో గంబూషియా చేపలను వదులుతున్నారు. దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోధకాలు వ్యాధులు రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.

దోమల గుడ్లపై చేపలతో దాడి

డెంగీ, మలేరియా కారక దోమలను అంతమొందించేందుకు మలేరియా విభాగం ఆధ్వర్యంలో చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా గంబూషియా చేపలను మత్స్యశాఖ నుంచి సేకరించారు. వర్షాకాలం వస్తోందంటే చాలు మత్స్యశాఖ వారు ముందుగానే గంబూషియా చేపలను ప్రత్యేకంగా మంచి నీటి వసతుల్లో పెంచుతారు. మలేరియా విభాగం డిమాండ్ మేరకు అవసరమైన చేపలను వారు సరఫరా చేస్తారు. గతేడాది కర్నూలు జిల్లాలో లక్ష చేపల వరకు సరఫరా చేయగా ఈ ఏడాది మొదటి విడతగా ఇప్పటికే 15వేల చేపలను పంపిణీ చేశారు. వీటిని రెండు రోజుల క్రితం అమడగుంట్ల, పోలకల్, గార్గేయపురం, బి.తాండ్రపాడు, కేతవరం, కర్నూలు పట్టణం, గుడిపాడులలోని నీటి కుంటలలో అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్, ఎస్‌యూఐ కృష్ణమోహన్, ఎంపీహెచ్ఈఓ వెంకటరమణ, ఎంపీహెచ్ఎస్ ప్రభాకర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు కలిసి వదిలారు. వీటితో పాటు మరో 80 వేల దాకా చేపలు కావాలని అధికారులు కోరారు.

సైజు చిన్నది–జీవితకాలం పెద్దది

గంబూషియా చేపల జీవితకాలం 4 నుంచి ఐదేళ్లు. ఇవి స్వచ్ఛమైన నీరు ఉండే స్విమ్మింగ్‌పూల్స్, మంచి నీటి చెరువులు, బావులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంప్‌లలోనే పెరుగుతాయి. ఆ నీటిలోని దోమల లార్వాలను, పీచును తిని ఇవి జీవిస్తాయి. ఆడ చేప 5.2 నుంచి 6.8 సెం.మీ వరకు ఉండగా మగ చేప 4.5 సెం.మీ వరకు ఎదుగుతుంది. ఒక్కో చేప రోజుకు 100 నుంచి 180 దోమల లార్వాలను తినేస్తుంది. ఈ చేపలు విడతకు 20 నుంచి 30 పిల్లలకు(ఇవి గుడ్లు పెట్టవు) జన్మనిస్తాయి. తమ జీవితకాలంలో ఒక్కో చేప 900 నుంచి 1200ల పిల్లలకు జన్మనిస్తుంది.

గంబూషియా చేపలతో దోమల నియంత్రణ



గంబూషియా చేపల ద్వారా దోమలను నియంత్రించవచ్చు. ప్రతి సంవత్సరం వర్షాకాలం ప్రారంభంలో డెంగీ, మలేరియా కారక దోమల నియంత్రణకు గాను గంబూషియా చేపలను నిల్వ ఉన్న నీటిలో వదులుతుంటాము. దోమల లార్వాలను చేపలు తినడం వల్ల దోమల సంతతి బాగా తగ్గుతోంది. ఇలాంటి చర్యలతో మలేరియా కేసులు తగ్గాయి. ప్రజలు సైతం ఇంట్లో మంచి నీటి నిల్వాలు లేకుండా కనీసం వారానికి ఒకసారైనా శుభ్రం చేసుకోవాలి. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.

–నూకరాజు, మలేరియా అధికారి, కర్నూలు

స్వయం ఉపాధిపై దృష్టి సారించండి


శిక్షణ సర్టిఫికెట్లు పొందిన యువతతో నిర్వాహకులు

కర్నూలు కల్చరల్ : నిరుద్యోగ యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని లయన్స్ జిల్లా అడిషనల్ కేబినెట్ సెక్రటరీ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీల సంయుక్త ఆధ్వర్యంలో వెంకటరమణ కాలనీలోని నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ స్వయం ఉపాధి శిక్షణలో భాగంగా యువతకు తెలుగు డీటీపీ, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల లోపు వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఈనెల 14వ తేదీ లోపు ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను వీఆర్ కాలనీ మొదటి లైన్‌లో ఉన్న నైస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9396861308 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్ సభ్యులు గోవర్ధనగిరి, చిన్నస్వామి, రాయపాటి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదం జరిగితే నష్టపోయేది తల్లిదండ్రులే

- మైనర్ డ్రైవింగ్‌లో పట్టుబడిన వారి తల్లిదండ్రులకు డీఎస్పీ హెచ్చరిక


స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ

కర్నూలు : మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదానికి గురైనా, లేదా ఎదుటివారికి ప్రమాదం తలపెట్టినా నష్టపోయేది తల్లిదండ్రులేనని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం అన్నారు. రోడ్డు ప్రమాద నివారణ కోసం ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా నగరంలోని రాజ్‌విహార్, సి.క్యాంప్ సెంటర్, ఓల్డ్ ఈద్గా, ఫైవ్‌రోడ్ జంక్షన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు మైనర్ డ్రైవింగ్‌పై శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా త్రిబుల్ రైడింగ్‌కు పాల్పడుతూ 14 మంది మైనర్లు పోలీసులకు పట్టుబడ్డారు. వారి వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కింద కేసులు నమోదు చేసి రూ.28,409ను తల్లిదండ్రులకు జరిమానా విధించారు. సాయంత్రం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై కారు బోల్తా


బోల్తా పడిన కారు

కర్నూలు : కర్నూలు బళ్లారి చౌరస్తా ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం అర్ధరాత్రి కారు బోల్తా పడిన ప్రమాదంలో రాహుల్ అనే వ్యక్తి గాయాలకు గురయ్యాడు. అలంపూరు నుంచి కల్లూరులోని వెంకటేశ్వర నగర్‌కు కారులో వెళ్తూ ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో అదుపు తప్పి బోల్తా పడి లారీని ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జు అయ్యింది. అయితే, ప్రమాదంలో రాహుల్ స్వల్ప గాయాలతోనే బయటపడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళితుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కండి


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(రూరల్): దేశ వ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని కార్మిక, కర్షక భవనంలో 'దళితులపై ఆగని దాడులు... కొనసాగుతున్న అంటరానితనం' అనే అంశం పై కేవీపీఎస్, వ్యకాసం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో లంబాడి హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ నాయక్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ రైతు సంఘం, రజక వృత్తిదారుల సంఘం, కాటికాపరుల సంఘం, చర్మకారుల సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎండీ అంజిబాబు, కేవీ నారాయణ, రామకృష్ణ, గురుశేఖర్, ఎన్‌జీ కృష్ణ, ఆంథోని ప్రసంగించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఈ నెల 15న 'స్వాతంత్ర్య భారతంలో దళితుల స్థితి' అనే అంశం పై నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

అనారోగ్యంతో ఎక్సైజ్ సీఐ మృతి


ఖాజా మొయినుద్దీన్ (ఫైల్)

కర్నూలు: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న ఖాజా మొయినుద్దీన్ అలియాస్ మున్నా (58) అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మధ్యాహ్నం మృతిచెందారు. ఈయన కర్నూలులోని ప్రకాష్ నగర్‌లో నివాసముంటున్నారు. కొన్నేళ్లుగా త్రోట్ క్యాన్సర్‌తో బాధపడుతుండేవాడు. ఈయన భార్య కూడా ఐదేళ్ల క్రితం గర్భాశయ క్యాన్సర్‌తో మృతిచెందింది. ఈయన 1984లో కానిస్టేబుల్ హోదాలో ఎక్సైజ్ శాఖలో చేరి అంచెలంచెలుగా సీఐ స్థాయికి ఎదిగాడు. కొన్నాళ్ల పాటు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో సుంకేసుల చెక్‌పోస్టులో విధులు నిర్వహించారు. క్యాన్సర్ జబ్బు తీవ్రం కావడంతో సెబ్ నుంచి మళ్లీ ఎక్సైజ్‌కు బదిలీ చేయించుకుని ప్రొద్దుటూరు ఐఎంఎల్ డిపోలో చేరి కర్నూలు అటాచ్‌మెంట్ కింద విధులు నిర్వహించేవారు. జబ్బు ముదిరిపోవడంతో హైదరాబాద్‌లో కూడా చికిత్స పొందాడు. అయినప్పటికీ తగ్గకపోవడంతో నెల రోజులుగా ఇంటి వద్దనే ఉంటూ కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం కోలుకోలేక మృతిచెందాడు. ఈయనకు ఇద్దరు కుమారులు సంతానం. సీఐ మరణ వార్త తెలిసిన వెంటనే కర్నూలు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావుతో పాటు పలువురు సహోద్యోగులు ఇంటి వద్దకు చేరుకుని నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

జగనన్న పథకాలు ఆదర్శనీయం


ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్


- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయమని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన స్థానిక 45వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లేబర్ కాలనీ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా ఎదిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన పథకాలు, వాటి అమలు, పేదలకు జరుగుతున్న మేలును ఇతర రాష్ట్రా ముఖ్యమంత్రులు పరిశీలిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభుదాస్, జమ్మన్న, భాస్కర్‌రెడ్డి, షేక్, ఇర్ఫాన్, సాధిక్, జోషి, చందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

కర్నూలు(హాస్పిటల్): రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి మహిళకు మోసం చేశాడు. బాధితురాలు శనివారం పోలీసులను ఆశ్రయించింది. పత్తికొండకు చెందిన గోవిందు అనే వ్యక్తి తనకు రైల్వేలో మంచి పరిచయాలు ఉన్నాయని, అక్కడ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలు ఎన్ఆర్ పేటకు చెందిన తులసీ మహిళను నమ్మించాడు. అతని మాటలు నమ్మిన ఆమె రూ.6.50లక్షలు చేతిలో పెట్టింది. ఎంతకూ ఉద్యోగం రాకపోవడంతో అనుమానం వచ్చి గోవిందుపై నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జి.పుల్లారెడ్డి లెక్చరర్‌కు ఉత్తమ టీచర్ అవార్డు


అవార్డు అందుకుంటున్న దృశ్యం

కర్నూలు సిటీ: జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజి మెకానికల్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డా.ఆర్. మీనాక్షిరెడ్డికి ఇంజినీరింగ్ కాలేజీ ఉత్తమ టీచర్ అవార్డును అందుకున్నారు. 2022 సంవత్సరానికి ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐఎస్‌టీఈ)వారు ఈ అవార్డు ప్రకటించారు. శనివారం గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన బహుమతులు ప్రదాన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, జేఎన్‌టీయూ(అనంతపురం)వీసీ, ఐఎస్‌టీఈ విభాగం ఏపీ ప్రెసిడెంట్ రంగ జనార్దన్, జేఎన్‌టీయూ(గుంటూరు)వీసీ వెంకట సుబ్బయ్య చేతుల మీదుగా మీనాక్షిరెడ్డి అవార్డు అందుకున్నారు. కాలేజీ చైర్మన్ పి.సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసరెడ్డి, మెకానికల్ విభాగాధిపతి మోహన్ రెడ్డి, ఇతర విభాగాధిపతులు, బోధనేతర సిబ్బంది ఆయనను అభినందించారు.

పనిభారం తగ్గించాలి

కర్నూలు(రూరల్): అంగన్ వాడీ వర్కర్లకు పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ కోరారు. శనివారం నగరంలోని కార్మిక, కర్షక భవనంలో కర్నూలు అర్బన్, కోడుమూరు ప్రాజెక్టుల అంగన్ వాడీ వర్కర్స్ విస్తృత స్థాయి సమావేశం ప్రాజెక్ట్ కార్యదర్శి రేణుక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ... కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం బడ్జెట్ నిధుల్లో కోత విధిస్తూ ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు గోపాల్, కర్నూలు అర్బన్ ప్రాజెక్ట్ కార్యదర్శి విజయ కుమారి, సరళ, వెంకట లక్ష్మి, విజయ లక్ష్మి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

'గో మహా పాదయాత్ర' కర్నూలుకు రాక

ఈ రోజు

కర్నూలు కల్చరల్: గో రక్షణకు, గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోరుతూ హైదరాబాద్ నుంచి అరుణా చలం వరకు పాద యాత్ర చేస్తున్న బాలకృష్ణ గురుస్వామి చేపట్టిన 'గో మహా పాదయాత్ర' ఆదివారం ఉదయం కర్నూలుకు చేరుకోనుంది. ఈ విషయాన్ని పాద యాత్ర నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు బాలాజీ నగర్ షిర్డీ సాయిబాబా దేవాలయం నుంచి వీఆర్ కాలనీ, సీతారం నగర్, బళ్లారిచౌరస్తా, చెన్నమ్మ సర్కిల్ మీదుగా కల్లూరు ఎస్టేట్‌లోని అవధూత రామిరెడ్డి తాత గోశాలకు చేరుకుంటుందని పేర్కొన్నారు.

ఆరోగ్య భారతి ఉచిత వైద్య శిబిరం

కర్నూలు కల్చరల్: ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కల్లూరులోని ఆదిత్య విద్యాలయంలో సిద్ధఆయుర్వేద యోగ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వైద్య నిపుణుల ద్వారా వెన్ను, మోకాళ్లు, కీళ్లు, పక్షవాతం, కిడ్నీ, కడుపు నొప్పి వ్యాధులకు చికిత్స చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు 89198 01926, 98859 71077 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.